క్లుప్తంగా

బాలికల వసతి గృహం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్‌చారి

గుత్తి: హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం సాయంత్రం సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్‌చారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతోపాటు భోజనం, వంట గది, హాల్, బాత్ రూమ్‌లు పరిశీలించారు. ఫ్యాన్‌లు, లైట్లు, బాత్ రూమ్‌లు సక్రమంగా లేకపోవడంతో వార్డెన్‌పై మండి పడ్డారు. హాస్టల్లో అన్ని సదుపాయలు ఉండాలే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయవాది కుమార్, పారా లీగల్ వలంటీర్లు మోహన్ రెడ్డి, ఇస్మాయిల్, కోర్టు సిబ్బంది సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

కలలు సాకారం చేసుకోవాలి



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ మురళి

శింగనమల: విద్యార్థులు కలలను సాకారం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని తరిమెల ఏపీజీబీ మేనేజర్ మురళి సూచించారు. శుక్రవారం మండలంలోని తరిమెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రగతి విద్యాజ్యోతి స్కాలర్ షిప్‌లను ఎస్టీ విద్యార్థినులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపకార వేతనానికి ఎంపికైన శశిరేఖ (7వ తరగతి), చైత్ర (8వ తరగతి), లక్ష్మీదేవి (9వ తగతి)కి రూ.5వేల చొప్పున వారి అకౌంట్‌కు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, పీఈటీ నరసింహారెడ్డి, బ్యాంక్ సిబ్బంది గురివిరెడ్డి, సీతారాంరెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

25న మండల సమావేశం

యల్లనూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న ఉదయం 11గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబరు సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఇల్లూరులో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె/యల్లనూరు: ఎవరైనా శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం గార్లదిన్నె మండలంలోని ఇల్లూరు, యర్రగుంట్ల గ్రామాల్లో డీఎస్పీ పర్యటించారు. ఈ సందర్భంగా ఇల్లూరులో ఎస్సీ,ఎస్టీ కేసు విచారణ అనంతరం ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే చిన్న విషయాలకు తగాదా పడి కేసులు నమోదు చేసుకోరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు. అలాగూ యల్లనూరు స్టేషన్‌లో పోలీసు సిబ్బందితో పుట్లూరు సీఐ సత్యబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మట్కా, పేకాట నిర్వాహకులతో పోలీసులకు ఏవైనా సంబంధాలు ఉంటే వెంటనే మానుకోవాలన్నారు. లేకంటే వీఆర్‌కు లేదా బదిలీ చేయిస్తామని సీఐ ఘాటుగా హెచ్చరించారు. ప్రజలు స్టేషన్‌కు వచ్చినప్పుడు మర్యాద పూర్వకంగా మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌ను శుభ్రంగా ఉంచుకోండి



మాట్లాడుతున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: మార్కెట్‌లో కుళ్లిన, మిగిలిపోయిన కూరగాయలు, ఆకుకూరలు, ఇతర చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సూచించారు. శుక్రవారం ఉదయం ఆయన పట్టణంలోని 21వ వార్డుతో పాటు 60 అడుగుల రోడ్‌తో పాటు కూరగాయల మార్కెట్‌లో శానిటేషన్‌ను పరిశీలించారు. 60 అడుగుల రోడ్‌లో మాంసం దుకాణాల వద్దనే పాట్రేళ్లను వదించి కోళ వ్యర్థాలను రోడ్లపై పారవేసిన దుకాణదారుడిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాంసం విక్రేతలు వ్యర్థాలను రోడ్లు, డ్రైనేజీలపై పడేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కూరగాయల మార్కెట్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని వ్యాపారులకు సూచించారు.

ఆస్పత్రి ప్రారంభానికి గ్రహణం

ఎక్కడైనా ఉన్నతాధికారుల ఆదేశిస్తే కింది స్థాయి సిబ్బంది వెంటనే అమలు చేస్తారు. కానీ పెద్దవడుగూరులో మాత్రం కలెక్టర్ ఆదేశాలనే బేఖాతరు చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిని గత నెలలో కలెక్టర్ వినోద్‌కుమార్ సందర్శించారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడాన్ని గమనించిన ఆయన.. నిర్మాణం పూర్తయిన కొత్త ఆస్పత్రి భవనం ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

- శిథిలావస్థకు చేరిన పాత ఆస్పత్రి భవనం
- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం
- కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని అధికారులు



ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభించాలని సూచిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)



పాత ఆస్పత్రిలో వర్షం నీటితో పొటుకెత్తుతున్న పైకప్పు



పాత ఆస్పత్రిలో నెర్రెలు చీలిన బాలింత గది

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ వినోద్ కుమార్ నెల రోజుల క్రితం పెద్దవడుగూరు గ్రామాన్ని సందర్శించిన సమయంలో ఆదేశించారు. అయినా ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదు. కలెక్టర్ ఆదేశాలనే బేఖాతర్ చేయడంపై మండలవాసులు మండిపడుతున్నారు. వివరాలు.. కొత్త ఆస్పత్రి భవనం నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. కలెక్టర్ పరిశీలించిన అనంతరం డీఎంఅండ్‌హెచ్‌ఓ భ్రమరాంబదేవి కూడా సందర్శించారు. అధికారులు, కాంట్రాక్టర్‌కు త్వరగా ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకూ పట్టించుకున్న పాపాన పోలేదు. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి పాత ఆస్పత్రి భవనం తడిసి ముద్దవుతోంది. ప్రతి గదీ వర్షం నీటితో పొటుకెత్తుతోంది. రోగులు లోపలికి వెళ్లి చికిత్స చేయించుకోవాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. గత 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి ఇప్పటికే చాలా వరకూ శిథిలావస్థకు చేరుకుంది. ఎవరైనా రోగులు చికిత్స చేయించుకోవడానికి వస్తే పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. వర్షం వచ్చిందంటే బాలింతల గది గోడలు ఉబ్బిపోయి కూలుతుందేమోనన్న భయంతో ఆందోళన చెందుతున్నారు. రోగుల కోసం ఏర్పాటు చేసిన మంచాలున్న గదిలో పైకప్పు మొత్తం కారుతుంది. దీంతో రోగులు నిత్యం పైకప్పు వైపు చూసుకుంటూ చికిత్స తీసుకోవాల్సి వస్తోంది. రోగులకు వైద్య సేవలు అందించే సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో మౌలిక వసతులు లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నూతన భవనం ప్రారంభం ఎప్పుడో?

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనం నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వ హయంలో నాడు–నేడు కింద రూ.కోటి నిధులతో నిర్మించిన ఈ ఆస్పత్రిని త్వరగా ప్రారంభానికి సిద్ధం చేయాలని అప్పట్లో అధికారులు ఆదేశాలు జారీ చేసినా.. ఎన్నికలు రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి నూతన ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించాలని, వైద్య సిబ్బందికి మౌలిక వసతులు కల్పించాలని మండలవాసులు కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో..



పెద్దవడుగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి దాపురించింది. ఆస్పత్రికి వచ్చినప్పుడు బెడ్డుపై పడుకోవాలంటేనే భయం వేస్తోంది. పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. కొత్త భవనం గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రోగుల గురించి సిబ్బంది కూడా సరిగా పట్టించుకోరు.

– మంజుల, చిట్టూరు

కలెక్టర్ ఆదేశాలు తుంగలో తొక్కారు



నూతన భవనం త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. పాత ఆస్పత్రిలో రోగులకు మౌలిక వసతులు లేవు. రోగుల ఇబ్బందులను గురించి ఎవ్వరూ పట్టించుకోరు. ఇక్కడ రాత్రి సమయాల్లో వైద్యులు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. నాణ్యమైన వైద్యం అందించాలి.

– బాలకృష్ణ, పెద్దవడుగూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాత ఆస్పత్రి భవనంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొత్త ఆసుపత్రి భవనంలో మిగిలిన పనులు పూర్తి చేసి త్వరగా అప్పగించాలని కోరుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు ఆదేశించిన వెంటనే కొత్తగా నిర్మించిన భవనంలోకి వెళ్లి విధులు నిర్వహిస్తాం.

– డాక్టర్ శ్రీనివాసబాబు పెద్దవడుగూరు

సాగు, తాగునీటి ఇబ్బందులు తీర్చాలి



పుట్లూరులో ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

పుట్లూరు/గార్లదిన్నె/శింగనమల/బుక్కరాయసముద్రం: సుబ్బరాయసాగర్‌కు నీరు సరఫరా చేసి చెరువులను నింపడంతో పాటు సాగు, తాగు నీటి సమస్యలకు పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పుట్లూరు మండలంలోని పుట్లూరు, కడవకల్లు, గార్లదిన్నె మండల కేంద్రం, శింగనమల మండల కేంద్రం, బుక్కరాయసముద్రం మండలంలోని బొమ్మలాటపల్లి, వెంకటాపురం, రేకులకుంట, రెడ్డిపల్లి, రోటరీపురం కొర్రపాడు, గ్రామాల్లో సాగునీటి సాధనలో భాగంగా చేపట్టిన బస్సు యాత్ర కొనసాగింది. ఆయన మాట్లాడుతూ సుబ్బరాయసాగర్‌ను నింపడం వల్ల పుట్లూరు, తాడిపత్రి, యల్లనూరు మండలాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. తుంగభద్రలో 200 టీఎంసీలు సముద్రం పాలైతే సుబ్బరాయసాగర్‌కు 0.75 టీఎంసీల నీటిని తీసుకురాలేకపోయారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వానికి మద్యం మీద ఉన్న శ్రద్ధ సాగునీటిపై లేదన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే.. వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సాగు నీటి సాధనలో భాగంగా ఈ నెల 21న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నా విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు, జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, బాలరంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నల్లప్ప, మండల కార్యదర్శులు సూరి, చెన్నారెడ్డి, భాస్కర్, రైతు సంఘం నాయకులు రాజారాంరెడ్డి, వెంకటచౌదరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషారాణి

పెద్దవడుగూరు: సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తామని తహసీల్దార్ ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను గురించి అధికారులు వివరించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకరావాలని తహసీల్దార్ సూచించారు. సీజనల్ వ్యాధుల గురించి డాక్టర్ అమర్‌నాథ్ తెలిపారు. బడి ఈడు పిల్లలను బడికి పంపాలని ఎంఈఓ రాముడు వివరించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, తాగునీటి సమస్య లేకుండా సర్పంచులు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు సూచించారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తవ్వుకుంటే ఉపాధిహామీ ద్వారా రూ.6 వేలు అందజేస్తామని ఏపీఓ పుల్లారెడ్డి తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారం గురించి సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ వివరించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు , సర్పంచులు , సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల అలసత్వంపై సభ్యుల ధ్వజం



మండల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో శుక్రవారం నిర్వహించిన మండలమీట్‌లో సమస్యల పరిష్కారంలో అధికారుల అలసత్వంపై సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీడీఓ తేజోత్స్న, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి హాజరయ్యారు. రీసర్వేతో రైతుల భూముల వర్తింపులో అవకతవకలను పరిష్కరించడంలో అధికారుల అలసత్వం వీడాలని రామరాజుపల్లి సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. వర్షపునీటికి రామగిరి చెరువులు పొంగిపొర్లి పంట పొలాలపై ప్రవహిస్తూ పంటలు దెబ్బతింటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ ధ్వజమెత్తారు. గ్రామాల్లో డ్రైనేజీలు లేక రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీటితో గ్రామీణులను రోగాలు వెంటాడుతున్నాయని వైస్ ఎంపీపీ కాయల మహేష్ ఆరోపించారు. హార్టికల్చర్ కింద పథకాల వర్తింపులో ఫుల్ అమౌంట్ చెల్లించి రెండేళ్లవుతున్నా సబ్సిడీ డబ్బులు నేటికీ ఖాతాలో పడలేదని సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణ కుమార్, ఏఓ లీనా వసుంధర, ఏఈ మధుసూదన్ రావు, ఇంజినీరు హేమ్లానాయక్, హార్టికల్చర్ అధికారిణి మిత్రవింద మాధవి, ఐకేపీ ఏపీఎం నల్లప్ప, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, సర్పంచ్‌లు పార్వతి, వెంకటేష్‌నాయక్, సూర్యనారాయణ, బాలనాగమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి దాతల చేయూత

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రేకుల షెడ్డు నిర్మాణానికి దాతలు సాయం అందించారు. అందుకు సంబంధించిన రూ.18వేల నగదును శుక్రవారం హెచ్ఎం మహాలక్ష్మికి దాతలు అందించారు. వివరాలు.. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత ఉంది. 6వ తరగతి విద్యార్థుల కోసం రేకుల షెడ్డు నిర్మించేందుకు ఉపాధ్యాయులు దాతల సాయం కోరారు. స్పందించిన గ్రామానికి చెందిన బొలిశెట్టి విజయకృష్ణ, వెంకటశివరామకృష్ణ, మచ్చ ముఖేష్, అశోక్‌కుమార్, నాగరాజు, నవజీవన్‌లు రూ.18 వేలు సమకూర్చి హెచ్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను హెచ్ఎంతో పాటుగా ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, సులోచన, శివప్రసాద్, సాధన, రవీంద్రనాథ్‌రెడ్డి, సుజాత, మాదన్న, శ్రీదేవి, రత్నకుమారి, చంద్రకళ, నరేంద్రనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గుంతకల్లు రూరల్/యాడికి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, మెరుగైన ఆరోగ్యానికి రోజూ తప్పనిసరిగా ఆహారంలో మునగ ఆకును చేర్చుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి సూచించారు. శుక్రవారం గుంతకల్లు మండలంలోని గుండాల తండా అంగన్‌వాడీసెంటర్లలో గర్భిణీలు బాలింతలకు మునగ ఆకు వల్ల కలిగే లాభాలను వివరించారు. అలాగే యాడికి మండల కేంద్రంలోని నంబర్1 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారితో కలిసి తాడిపత్రి సీడీపీఓ. షాజిదా భేగం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మునగాకుపై అవగాహన కల్పించారు.

'ప్రజలపై ట్రూఅప్ చార్జీల భారం మోపొద్దు'

గుంతకల్లుటౌన్: విద్యుత్ వినియోగదారులపై రూ.8,114 కోట్ల ట్రూ అప్ (ఇంధన సర్దుబాటు) చార్జీల భారాన్ని మోపరాదని సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకులు ఆలూరు రోడ్‌లోని విద్యుత్ నిలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుతి, రమేష్, నాగరాజు, సునీల్, సురేంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

యల్లనూరు: మండలంలోని వాసాపురం, తిమ్మంపల్లి గ్రామాల్లో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పుట్లూరు సీఐ సత్యబాబు దాడులు చేశారు. ఈ దాడుల్లో ముగ్గురు మట్కా బీటర్లను అదుపులోకి తీసుకున్నారు.

పప్పుశనగ పంపిణీ ప్రారంభం

గుంతకల్లు రూరల్: స్థానిక మార్కెట్‌యార్డులో శుక్రవారం సబ్సిడీ పప్పుశనగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, ఏఓ స్వాతి, టీడీపీ నాయకుడు నారాయణ స్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశులు తదితరులు హాజరయ్యారు. పప్పుశనగ తీసుకున్న రైతులు వర్షాలు తగ్గుముఖం పట్టేదాకా విత్తనం వేయవద్దని, వేరుశనగ పంట తుఫాను ప్రభావం తగ్గిన తరువాతనే తొలగించుకోవాలని ఏఓ సూచించారు.

అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

బుక్కరాయసముద్రం: అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పుణ్యవతి, సీఐ కరుణాకర్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో టపాసుల విక్రయ కోసం దరకాస్తు చేసుకున్న వారితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టపాసులు విక్రయించాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలన్నారు. అనంతరం చెరువు కట్ట వద్ద సాయిబాబాగుడి సమీపంలోని టపాసుల విక్రయ కేంద్రానికి స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడవలితో దాడి.. వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో శుక్రవారం రాత్రి కోట నల్లపరెడ్డి అనే వ్యక్తి కొడవలితో దాడి చేయడంతో అదే గ్రామానికి చెందిన అశ్వర్థ రెడ్డి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. పాత కక్షల నేపథ్యంలోనే కొడవలితో దాడి జరిగిందన్నారు.

బిహారీ అనుమానాస్పద మృతి

యాడికి: పెద్దపప్పూరు మండలం గుత్తి అనంతపురం సమీపంలోని జాతీయ రహదారిపై బిహార్‌కు చెందిన డ్రైవర్ అఖిలేష్‌కుమార్ రాయ్(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. తమిళనాడులోని హొసూరు నుంచి బిహార్‌కు కంటైనర్‌ను తీసుకెళుతున్న అఖిలేష్ కుమార్ గురువారం మధ్యాహ్నం గుత్తి అనంతపురం సమీపంలోకి చేరుకోగానే కంటైనర్ ఆగిపోయింది. అప్పటి నుంచి కంటైనర్ ఒకేచోట ఉండడంతో జీపీఎస్ ఆధారంగా విషయాన్ని గుర్తించిన యజమాని తన బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. డ్రైవర్ మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని విషయాన్ని చేరవేశారు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి చిన్నాన్న కుమారుడు చందనకుమార్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు రూరల్/పుట్లూరు/యల్లనూరు/పెద్దవడుగూరు/పామిడి: రీ సర్వే అనంతరం గ్రామాల్లో మిగిలి ఉన్న భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే రెవెన్యూ గ్రామసభలను నిర్వహిస్తున్నామని ఆర్డీఓ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గుంతకల్లు మండలంలోని సంగాల, తిమ్మాపురంలో గ్రామసభలను నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఇప్పటికీ చిన్నపాటి సమస్యలు ఉన్నాయన్నారు. ఎల్‌పీఎం నెంబర్లు సక్రమంగా రాకపోవడం, ఆన్‌లైన్‌లో నమోదు అయిన భూమి వివరాల్లో తేడాలు ఉండటం వంటి సమస్యలను గుర్తించామని, వీటన్నింటినీ పరిష్కరించేందుకు రైతులనుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది ఈ గ్రామసభల్లో పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలంలోని దోసలేడు, మడుగుపల్లిలో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ శేషారెడ్డి, ఆర్ఐ క్రిష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.యల్లనూరు మండలంలోని నిట్టూరులోని ఆర్ఐ చిన్ననారాయణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, సర్వేయర్ షర్వాని ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పెద్దవడుగూరు మండలంలోని తెలికి, చింతలచెరువు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ ఉషారాణి, ఆర్ఐ లహరిక, సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని సొరకాయలపేట, నెమళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ ఎస్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో రీ సర్వేపై సమావేశం నిర్వహించారు.

'తెలుగు తమ్ముడి' దౌర్జన్యం



టిప్పర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

పామిడి: 'అధికారం మాది. అక్రమంగా ఇసుక, గరుసు తరలించే సర్వహక్కులు మావే. నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండదండాలన్నీ నాకే'. ఇది ఒక తెలుగుదేశం నాయకుడి అధికార దర్పం. ఆయన దౌర్జన్యానికి రెండు టిప్పర్లు ధ్వంసమయ్యాయి. వివరాలు.. శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన చిన్న నరసింహుడు పామిడిలోని ఎద్దులపల్లిరోడ్డులో నివాసముంటున్నాడు. అతడు ప్రభుత్వ అనుమతి ఉన్న గ్రావెల్ క్వారీతో పాటు రెండు టిప్పర్లు, ఒక ఇటాచీ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. గత ఐదునెలలుగా గ్రావెల్ తరలింపు మానివేశాడు. అందులో భాగంగా హైవేలోని అయ్యప్పగుడి ఎదురుగా సొంత స్థలంలో టిపర్లు ఉంచాడు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు టిప్పర్లు ఉన్న స్థలంలో ట్రాక్టర్లతో ఇసుక తోలారు. దీంతో కోపోద్రిక్తుడైన ఆ పచ్చ నాయకుడు తన అల్లరి మూకతో దాడి చేయించి టిప్పర్ల అద్దాలను ధ్వంసం చేయించాడు. దీంతో రూ.3.50 లక్షలు నష్టం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా రోజురోజుకూ రెచ్చిపోతున్న టీడీపీ నాయకుడి తీరుపై సొంతపార్టీలోనే లుకలుకలు మొదలయ్యాయి.

ఘనంగా పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి రూరల్: మండలంలోని అర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో శుక్రవారం అర్జాస్ జర్నీ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎండీ క్రిష్ణమూర్తి, హెచ్‌ఆర్ నరేంద్ర, ఇండస్ట్రీస్ ఆఫీసర్ జయప్రకాష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ ఆస్పత్రిని శాశ్వతంగా మూసివేయాలి'

గుత్తి: పట్టణంలో ఇటీవల డీఎంఅండ్‌హెచ్ఓ సీజ్ చేసిన ప్రైవేట్ ఆస్పత్రిని శాశ్వతంగా మూసివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఆ ఆస్పత్రిలో వైద్యం వికటించి కొందరు రోగులు మరణించారన్నారు. కాబట్టి ఆ ఆస్పత్రిని శాశ్వతంగా మూసి వేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లాలెప్ప, పట్టణ అధ్యక్షులు హరి, కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

కసాపురం ఎస్ఐగా వెంకటస్వామి



గుంతకల్లు రూరల్: కసాపురం ఎస్ఐగా టీపీ వెంకటస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నరేంద్ర కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కుందుర్పి మండలం నుంచి బదిలీపై వచ్చిన టీపీ వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించారు.

పెద్దవడుగూరు ఎస్ఐగా ఆంజనేయులు



పెద్దవడుగూరు: పెద్దవడుగూరు ఎస్ఐగా ఆంజనేయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న చిన్నరెడ్డప్ప అనంతపురానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో కంబదూరు ఎస్ఐ ఆంజనేయులు పెద్దవడుగూరుకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు.

కథల పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని జ్యోత్స్న

గుంతకల్లు రూరల్: హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.జ్యోత్స్న ప్రతిభ కనబరచింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 232 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో 28 కథలు ఎంపిక కాగా, అందులో జ్యోత్స్న రాసిన కథ కూడా ఎంపిక అయింది. ఎంపికయిన విద్యార్థులకు నవంబర్ 3న హైదరాబాదులోని రవీంద్రభారతిలో నగదు బహుమతులతోపాటు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేస్తారు. తమ పాఠశాల నుంచి జ్యోత్స్న ఎంపిక కావడం గర్వకారణమని హెచ్ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వేరుశనగ గోదాముల పరిశీలన

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో వేరుశనగ విత్తనాలు విక్రయించే గోదాములను ఏఓ సోమశేఖర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ కొంత మంది వ్యాపారస్తులు లైసెన్స్‌లు లేకున్నా రైతులకు వేరుశనగ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేశామన్నారు. మండలంలో ఎవరికీ లైసెన్స్ లేదని, రైతులు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న వారి వద్ద బిల్లు పొంది వేరుశనగ విత్తనకాయలు తీసుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వేరుశనగ విత్తనకాయలు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

గుత్తి: గుత్తిలో శుక్రవారం అనంతపురం ఎంవీఐ మనోహర్‌రెడ్డి విస్తృతంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని వాహనాల డ్రైవర్లపై జరిమానా విధించారు. రికార్డులు సక్రమంగా లేని, లైసెన్స్‌లు లేని రెండు బొలెరా వాహనాలు, ఒక కారు, ఒక ఆటో, 407 వాహనం, ఒక జీపు ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఒక్కొక్క వాహనానికి రూ. 2500 చొప్పున మొత్తం రూ.15 వేలు డ్రైవర్లకు జరిమానా విధించారు.